క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ కార్యదర్శిగా కొండలు



మాచవరం: పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా మాచవరం మండలం రేగులగడ్డ గ్రామానికి చెందిన జక్కుల కొండలు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. జిల్లా యువజన విభాగంలో తనకు స్థానం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడతానని అన్నారు. జిల్లా కార్యదర్శిగా ఎంపికైన కొండలుకు పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు.

కాట్రపాడులో ఉచిత వైద్యశిబిరం



దాచేపల్లి : మండలంలోని కాట్రపాడు గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరంలో డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌తో పాటు మరికొంత మంది వైద్యులు పాల్గొని ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలు అందించారు. పలువురు రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. తమ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవ కార్యక్రమాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ అశోక్‌కుమార్ చెప్పారు. ఈ శిబిరంలో సర్పంచ్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వే సంఘం అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక



మండల సర్వేయర్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన ముని, ఏసురాజు

మాచర్ల రూరల్: సర్వే ఉద్యోగుల సంఘం తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా వడితె ముని, కేశబోయిన ఏసురాజులు ఎన్నికయ్యారు. ఆదివారం సర్వే కార్యాలయంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ సుభాని, కార్యదర్శి షేక్ యాసిన్ బాషా నేతృత్వంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా యూనిట్ కార్యదర్శి రవీందర్ రెడ్డి వ్యవహరించగా కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి జింకల ఆదినారాయణ, సర్వేయర్లు మనినాయక్, దుర్గా, చందర్, కోటేశ్వరరావు, షానా, సంధ్యా, బాలాజీ, అంజి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటిని కాచి చల్లార్చి వినియోగించండి

సత్తెనపల్లి: పట్టణంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని కాచి, చల్లార్చి, వడగట్టి వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం తెలిపారు. పురపాలక సంఘానికి చెందిన మంచినీటి నిల్వ చెరువులో నీటిమట్టం రోజురోజుకు తగ్గు ముఖం పడుతున్నందున కుళాయిల ద్వారా సరఫరా చేయుచున్న మంచినీరు కొంత రంగు మారడం జరుగుతుందన్నారు. నాగార్జున సాగర్ కాలువల ద్వారా మంచినీటి చెరువులకు నీరు విడుదల చేసే వరకు పట్టణ ప్రజలు పురపాలక సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

పల్నాటి మాత.. పాతపాటేశ్వరమ్మ

- మహిమ గల అమ్మగా పేరొందిన వైనం
- రేపు అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం

గురజాల : పట్టణంలో వందల సంవత్సరాల కిందట పాతపాటేశ్వరి అమ్మవారిగా అవతరించి పల్నాటి మాతగా భక్తుల పూజలను అందుకుంటుంది. దుగ్గరాజు వంశం వారిచే ప్రతిష్ఠించబడినట్లు దేవాలయంలోని శిలాశాసనం ద్వారా తెలుస్తుంది. అమ్మవారి మహిమలు కోకొల్లలు. పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయాలు వేరే ప్రాంతంలో ఉన్నప్పటికీ పల్నాటి మాతగా పేరుగాంచిన గురజాల పాతపాటేశ్వరి అమ్మవారి చరిత్ర ప్రసిద్ధి పొందింది.

ఆలయ విశిష్టత..

నాయకురాలు నాగమ్మ గురజాలలో కొలువై ఉన్న అమ్మవారిని దర్శించకుండా వెళ్లటం వలన మార్గం మధ్యలో గుర్రం అస్వస్థతకు గురైందని ఆమె చేసిన పొరపాటును గుర్తించి అమ్మవారిని మనస్సులో స్మరించుకోగా గుర్రం యథాతథస్థితికి వచ్చిందని చరిత్ర చెబుతుంది. క్రీ.శ.1826లో అప్పటి కలెక్టర్ ఒక్సన్‌దొర పన్నుల వసూలు నిమిత్తం గురజాలకు వచ్చి గుర్రాలను అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కట్టి మేత వేయుచుండగా భక్తులు వాటిని దూరంగా కట్టివేయమని లేనిచో అమ్మవారి ప్రాంగణం అపవిత్రం అవుతుందని తెలిపారు. దొర భక్తులపై ఆగ్రహం వ్యక్తం చేసి అమ్మవారి మహిమలను చులకన చేసి మాట్లాడటంతో గుర్రాలు నోటి నుంచి నురుగులు కారుతూ పడిపోయాయి. అప్పుడు దొర అమ్మవారిని ప్రార్థించగా గుర్రాలు యథాస్థితికి చేరుకున్నాయట. అమ్మవారి మహిమలకు దొర సంతోషించి పన్నులు రద్దుచేసి 40 ఎకరాల భూమిని కానుకగా సమర్పించినట్లు తెలుస్తుంది.

6 రోజుల పాటు తిరునాళ్ల మహోత్సవాలు..

అమ్మవారికి ప్రతి సంవత్సరం మార్గశిర శుద్ధ ఏకాదశి మొదలు బహుళ పాడ్యమి వరకు 6 రోజుల తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో ఏకాదశి రోజున అమ్మవారికి బియ్యం కొలత జరుగును. ఆరోజు బియ్యం కొలిచి ముడుపు కడితే 4వ రోజు అమ్మవారి మహిమతో బియ్యం రెట్టింపు అవుతాయని భక్తుల విశ్వాసం. 5వ రోజు అనగా పౌర్ణమి రోజు అమ్మవారి తిరునాళ్ల ఉత్సవం ఘనంగా జరుగుతుంది. భక్తులు పిండి వంటలు (గారె,బూరె)చేసి వాటిని కొరికి కుక్కలకు వేస్తారు. అలా చేస్తే శరీరంలోని విష స్వభావం తొలగిపోతుందని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవంలో ముఖ్యమైనది శిడిమాను ఉత్సవం. శిడిమానులో రైతులు తమ పొలాల్లో పండిన ధాన్యాలు శిడిమానుకు కడతారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు.



తిరునాళ్లకు ముస్తాబయిన అమ్మవారి దేవాలయం



మహిమలు గల అమ్మ పాతపాటేశ్వరమ్మ

శాలివాహనుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు..

తిరునాళ్ల ప్రారంభం నుంచి 16 రోజుల పండుగ వరకు అమ్మవారికి శాలివాహన కులస్తులు పూజలు నిర్వహిస్తారు. ఈ 16 రోజులు ఆలయ అర్చకులు అమ్మవారికి పూజలు నిర్వహించరు. శాలివాహనులు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

అమ్మవారి కృపకు పాత్రులు కండి..



అమ్మవారి తిరునాళ్ల రోజు అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలి. అమ్మవారికి కూరపాటి రామారావు వెండి చీరను, మన్నెం కన్యాకుమారి ప్రసాద్ దంపతులు వెండి పవిట కొంగును, ఉల్లి గోపాలకృష్ణ అమ్మవారికి వెండి నిమ్మకాయలు అందించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వెండి ఆభరణాలతో అమ్మవారిని అలంకరించడం జరుగుతుంది.

– కనకం ఆదినారాయణ దత్తు , కమిటీ చైర్మన్

ఏర్పాట్లు పూర్తి ..



అమ్మవారి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి చేసాం. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లు, ప్రసాదం పంపిణీ ఏర్పాట్లకు తగు చర్యలు తీసుకుంటాం. అమ్మవారి దేవాలయానికి సంబంధించి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయి. ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు.

– గణపతి సురేష్, ఈవో, గురజాల

పట్టణ అధ్యక్షుడిగా షేక్ మస్తాన్



షేక్ మస్తాన్



మాచర్ల పవన్ కుమార్

మాచర్ల: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన సంఘ నాయకులు ఇద్దరిని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకత్వం కీలక పదవుల్లో నియమిస్తూ ఆదివారం నియామక పత్రాలను పంపగా వాటిని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు వారికి అందించి అభినందించారు. పట్టణంలోని తూర్పు బావి ప్రాంత నివాసి మైనార్టీ కీలక నేత షేక్ మస్తాన్ మొదటి నుంచి యువజన విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయనను పట్టణ యువజన విభాగ అధ్యక్షులుగా నియమించారు. అదే విధంగా దళిత వర్గానికి చెందిన 20వ వార్డు మాచర్ల పవన్ కుమార్‌ను పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శిగా నియమించారు. వీరిద్దరికీ ఆదివారం పార్టీ క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలు అందజేసి పీఆర్కే, పీవీఆర్‌లు అభినందించారు. వీరితో పాటు మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, బోయ రఘురామిరెడ్డి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పోలా శ్రీను, ఆయా వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయిన చర్చిలు

- విద్యుత్ దీప కాంతులతో చర్చిలు
- అందంగా అలంకరించిన పశువుల పాకలు, క్రిస్మస్ ట్రీలు

రెంటచింతల: లోకరక్షకుడైన యేసుక్రీస్తు పుట్టుక సందర్భంగా సోమవారం కనులపండుగగా జరుపుకునేందుకు రెంటచింతల మండలంలోని వివిధ గ్రామాలలో చర్చిలు, ప్రార్థనా మందిరాలు రంగురంగుల విద్యుత్ కాంతులతో సిద్ధమయ్యాయి. రెంటచింతల అనగానే రోళ్లుసైతం పగిలే ఎండలే గుర్తుకొస్తాయి, కానీ ప్రేమను వర్షించే ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కానుకమాత దేవాలయం ఇక్కడే ఉంది. సమస్తమానవాళికి సూక్తులు బోధిస్తూ ఆధ్యాత్మిక కేంద్రంగా రాష్ట్రంలోనే పేరుపొందిన రెంటచింతల క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. ప్రస్తుతం కానుకమాత చర్చి విచారణ గురువులుగా ఏరువ లూర్దుమరెడ్డి, లూథరన్ చర్చి పాస్టర్‌గా కటికల యేసుదానం సువార్తను భక్తులకు బోధిస్తున్నారు.

120 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన లూథరన్ చర్చి

చలువరాతి కట్టడం.. ఎత్తయిన 2 టవర్లు.. మోగిస్తే 8 కి.మీ.ల పరిధివరకు వినిపించే 400ల కేజీల బరువైన అరుదైన పంచలోహంతో తయారైన గంట.. జర్మనీ నుంచి తీసుకువచ్చిన ఏసుక్రీస్తు ప్రతిమలు.. పురాతన బాప్టిజం తొట్టి.. ఇత్తడి శిలువ ఇలా ఎన్నో ఎన్నెన్నో ప్రత్యేకతలు ఉన్న రెంటచింతలలోని ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి క్రిస్మస్ వేడుకలకు సుందరంగా ముస్తాబై క్రీస్తు భక్తులకు సాదరంగా ఆహ్వానం పలుకుతుంది. 1903లో జర్మనీ దొర ఆల్‌బర్ట్ జార్జి ఈ చర్చి నిర్మాణ పనులను ప్రారంభించి 9 ఏళ్లలో పూర్తి చేసి 1912 జూన్ 15 నుంచి ప్రార్థనలకు నిలయంగా మారింది. ఈ చర్చిలో 1923 వరకు జర్మనీ దేశస్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఆకట్టుకుంటున్న క్రిస్మస్ పశువుల పాకలు..

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా గ్రామంలోని పలుదేవాలయాలలోను, పాఠశాలలలోను, క్రైస్తవుల నివాసాలలో ఏర్పాటుచేసుకున్న బాలయేసు జన్మించిన పశువుల పాకలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కానుకమాత చర్చిలో, సాగర్‌మాత జూనియర్ కళాశాల వసతిగృహంలో, ఫాతిమా మాత, లూర్దుమాత, ఆరోగ్యమాత మందిరాలవద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ పశువుల పాకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



1850వ సంవత్సరంలో నిర్మించిన పురాతనమైన కానుకమాత చర్చి

క్రిస్మస్ శుభాకాంక్షలు

మాచర్ల: ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా ప్రజలందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా ప్రతి క్రైస్తవుడు ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థన చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా క్రిస్మస్‌ను జరుపుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

దాచేపల్లి : నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో క్రిస్మస్ పండుగ వేడుకలు జరుపుకోవాలని, ప్రభువైన ఏసుక్రీస్తు ప్రజలందరికి శాంతి సమాధానం అనుగ్రహించాలని కోరారు.

ఏసుక్రీస్తు జన్మదినానికి సర్వం సిద్ధం

మాచర్ల: పట్టణంలోని క్రిస్మస్ పండుగను ఘనంగా జరిపేందుకు అన్ని ప్రాంతాల్లోని చర్చిలను ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. చర్చిలను అందంగా అలంకరించారు. పట్టణంలోని ప్రముఖ చర్చిలైన ఏఎల్‌సీ, ఆర్సీఎం, బాప్టిస్టు, ది లెమెన్స్ ఇవాంజలికల్, బేతేలు, పెంతెకోస్తుతో పాటు అనేక చర్చిల్లో ఏర్పాట్లు చేశారు. బదర్లు, చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో క్రీస్తు జన్మదినం సందర్భంగా 70 చర్చిల్లో ఏర్పాట్లను చేశారు. ఈ చర్చిల్లో ఆయా సంఘ పెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు జరగనున్నాయి.



స్థానిక కానుకమాత చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ పశువులపాక

మాచవరంలో..



పిన్నెల్లిలో విద్యుత్ దీపాలతో తెలుగు బాప్టిస్టు చర్చి

మాచవరం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పండగ ను ఘనంగా జరుపుకునేందుకు మండలంలోని ప లు గ్రామాల్లోని చర్చిలను క్రైస్తవ సోదరులు విద్యు త్ దీపాలతో సుందరంగా అ లంకరించారు. ప లు చోట్ల కొవ్వొత్తుల ప్రదర్శన, ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. క్రైస్తవ గీతాలు ఆలపించి దేవున్ని స్తుతించారు. చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పాస్టర్లు ఏసు క్రీస్తు జనన సందేశాన్ని తెలియజేశారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలకు కుట్టు మిషన్లు, చీరలు పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు, చీరలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: మహిళల అభివృద్ధికి పూజిత మహిళా సొసైటీ ఆఫ్ డెవలప్‌మెంట్ సోషల్ కృషి చేయటం ఎంతో అభినందనీయమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నరిశెట్టి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన మాచర్లలో పూజిత మహిళా సొసైటీ ఆఫ్ డెవలప్‌మెంట్ సోషల్ అధ్యక్షురాలు యరబోతుల కోటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 50 మంది మహిళలకు ఉచితంగా సొసైటీ తరపున కుట్టుమిషన్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల ప్రాంతంలో ఎనలేని సేవ చేస్తున్న కోటేశ్వరి సేవలు ఎంతో ప్రశంసనీయమన్నారు. సొసైటీ అధ్యక్షురాలు కోటేశ్వరి మాట్లాడుతూ ఇప్పటి వరకు 50 మందికి కుట్టుమిషన్లు అందజేయటం జరిగిందని, మరో 60 మందికి అందిస్తామన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమన్నారు. అందులో భాగంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు పోలా శ్రీను, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా..

సత్తెనపల్లి అంబేద్కర్ నగర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం



పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో క్రికెట్ పోటీలను ప్రారంభించిన పెండెం బాబురావు

సత్తెనపల్లి: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 31వ వార్డు మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంచేలా క్రికెట్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించనుందని, ప్రతి క్రీడాకారుడు క్రీడల్లో మెలకువలను తెలుసుకొని ముందుకు వెళ్లాలన్నారు. క్రీడల వలన పోటీతత్వం పెరుగుతుందన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలుగు తీయడమే లక్ష్యంగా పోటీలను నిర్వహించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల హనుమంతరావు, నిజాంపట్నం అమరేంద్రలు మాట్లాడారు. ముందుగా పెండెం బాబురావు బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ఇరికేపల్లి లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని, సంతోషంగా జరుపుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, మందపాటి కృష్ణారెడ్డి, ఈదా సీతారామిరెడ్డి, పాస్టర్ రవికాంత్, సంఘ పెద్దలు పప్పుల విజయ్‌భాస్కర్‌రావు, పప్పుల పోలేసు, పప్పుల సుందరరావు, పప్పుల ఆంజనేయులు, జాలె అశోక్, బత్తుల కాసులు పాల్గొన్నారు.

మాచవరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో జోసఫ్ ఎంజిల్ షేర్ అండ్ కేర్ వికలాంగుల వృద్ధాశ్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ సాగర్‌బాబు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. వృద్ధులకు, వికలాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు కోడూరి అజయ్ బాబు, స్థానిక పెద్దలు ప్రవీణ్, దేవయ్య, దిలిఫ్, నిర్మల పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడిగా చంద్రశేఖరరెడ్డి



కారెంపూడి: వైఎస్సార్‌సీపీ కారెంపూడి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా చిలుకూరి చంద్రశేఖరరెడ్డి నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి నాలుగవ సారి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వారి బాటలో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీమత్ హనుమత్ వ్రత వేడుకలు



అమరావతి: శ్రీమత్‌హనుమత్ వ్రతాన్ని పరస్కరించుకుని ఆదివారం ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని ప్రసన్నాంజనేయస్వామి వారికి ప్రత్యేకపూజలు, ఆకుపూజలు, హనుమాన్‌చాలీసా పారాయణం చేసి వడమాలలు సమర్పించుకున్నారు. తొలుత ఆలయ అర్చకుడు పరుచూరి కేశవచార్యులు స్వామి వారికి పంచామృత స్నపన, సహస్ర నామాలతో తమలాపాకులతో పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వేమూరి గోపినాధశర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.